
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



రామయ్యకు నిధులేవి..?
భద్రాచలం రామాలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని సీఎం కేసీఆర్ 2014లో హామీ ఇచ్చినా.. నేటికీ కార్యరూపం దాల్చలేదు. 8లో



రాత్రి వేళ వైద్య సిబ్బంది విధులు
వైద్య సిబ్బంది రాత్రి వేళ కూడా విధులు నిర్వహిస్తూ ఫైలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు రక్తనమూనాలు సేకరిస్తున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
37° / 19°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళ మాత్రం కొంత చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలంకరణలో భద్రాద్రి రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్ల వారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతంతో వైభవంగా అభిషేకం చేశారు. ముందుగా అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

త్రిషను అభినందించిన మంత్రి హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావుతో త్రిష, రామిరెడ్డి

భద్రాచలంఅర్బన్: ఇటీవల జరిగిన అండర్–19 మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో విజయం సాధించిన భారత జట్టు సభ్యురాలు, భద్రాచలానికి చెందిన గొంగడి త్రిషను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అభినందించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆమె తన తండ్రి రామిరెడ్డితో పాటు మంత్రిని కలవగా అభినందించి మాట్లాడారు. భవిష్యత్‌లో ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. త్రిషతో పాటు జట్టు సభ్యులకు కూడా మంత్రి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు.

ఎస్‌ఏ–2 పరీక్షల షెడ్యూల్ విడుదల



ఎస్.ఎస్.ఎస్.ప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సంబంధించి ఎస్‌ఏ–2 (సమ్మెటివ్ అస్సెస్‌మెంట్) ఫైనల్ పరీక్షల షెడ్యూల్ శుక్రవారం విడుదలైందని డీఈఓ ఎస్.ఎస్.ఎస్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 12 నుంచి 20 వరకు పరీక్షలు జరుగుతాయని, 21న ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇక పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ఉంటాయని తెలిపారు.

15 నుంచి 'పది' విద్యార్థులకు అల్పాహారం

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నందున ఈనెల 15 నుంచి ఏప్రిల్ 1 వరకు అల్పాహారం అందజేయనున్నట్లు డీఈఓ తెలిపారు. జిల్లాలో మొత్తం 110 పాఠశాలల్లో 4,058 మంది పదో తరగతి చదువుతున్నారని, ఒక్కొక్కరికి రూ.15 చొప్పున సమగ్ర శిక్ష ఎస్‌పీడీ అధికారులు బడ్జెట్ విడుదల చేశారని వివరించారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో అమలయ్యేలా ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు చర్యలు చేపట్టాలని డీఈఓ ఆదేశించారు.

మాటిస్తేనే పట్టా..



ఇల్లెందు మండలంలో పోడు సాగు చేస్తున్న రైతు (ఫైల్)

పోడు భూములపై అసెంబ్లీలో సీఎం ప్రకటన

- భవిష్యత్‌లో పోడు నరికితే ఊరుకునేది లేదని హెచ్చరిక
- జిల్లాలో 63వేల కుటుంబాలకు లబ్ధి
- 1.37 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో పోడు భూములకు పట్టాల జారీ అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. ఇటీవల పోడు భూములకు పట్టాలు జారీ చేసేందుకు జిల్లా యంత్రాంగం రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ శుక్రవారం అసెంబ్లీలో పట్టాల జారీపై చేసిన ప్రకటనతో పోడు వ్యవహారంలో కొత్త మలుపులు చోటుచేసుకున్నాయి.

1.37 లక్షల ఎకరాలకు..

గత 15 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో పోడు పేరుతో అడవులు నరికి సాగు భూములుగా మార్చారు. అధికారిక అంచనాల ప్రకారమే జిల్లాలో పట్టాలు ఇవ్వాల్సిన భూమి 2.99 లక్షల ఎకరాలు ఉంది. దీనికి పట్టాల కోసం 82,895 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 63,315 మంది గిరిజనులు 1,37,000 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. అయితే పోడు పట్టాల పంపిణీపై శుక్రవారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్ కీలక ప్రకటన చేశారు. ఈ నెలాఖరున అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు అందజేసే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. అయితే పలు షరతులకు లోబడే అర్హులకు పట్టాలు అందిస్తామన్నారు.

వాటిపై సందిగ్ధం

సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో చెప్పినట్టుగా ప్రభుత్వం విధించిన షరతులను అంగీకరిస్తే జిల్లాలో సుమారు 63 వేల కుటుంబాలకు 1.37 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు అందే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే పోడు ద్వారా సాగులోకి వచ్చి, సుమారు 17,580 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్న 1.63 లక్షల ఎకరాల పోడు భూములపై సందిగ్ధం నెలకొంది. గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న పోడు భూములకు పట్టాల జారీ విషయం సందేహంలో పడింది. అటవీ హక్కుల చట్టం తరహాలో కేవలం గిరిజనులకు పోడు పట్టాలు జారీ చేసి మిగిలిన వర్గాలను మినహాయించే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ కానప్పటికీ సీఎం కేసీఆర్ ప్రసంగం ఈ దిశగానే సాగింది. గిరిజనేతరుల చేతుల్లో ఉన్న పోడు భూములపై ఏ నిర్ణయం తీసుకుంటారు, కార్యాచరణ ఏంటనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

జిల్లాలో పోడు దరఖాస్తులు	: 82,895
పోడు భూ విస్తీర్ణం	: 2.99 లక్షల ఎకరాలు
గిరిజనుల ఆధీనంలో ఉన్న భూములు	: 1.37 లక్షల ఎకరాలు
దరఖాస్తు చేసుకున్న గిరిజనులు	: 65,315 మంది
దరఖాస్తు చేసుకున్న గిరిజనేతరులు	: 17,580
గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న భూములు	1.62 లక్షల ఎకరాలు

షరతులివే..

- అర్హులైన గిరిజనులకే పోడు పట్టాలు
- భవిష్యత్తులో పోడు చేయబోమంటూ ఆయా గ్రామాల గిరిజన పెద్దలు, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ కమిటీలు లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలి.
- పట్టాలు అందుకున్న తర్వాత హామీలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రాతపూర్వక హామీ ఇవ్వని గ్రామాల్లో పోడు పట్టాల జారీ నిలిపివేత

రాబోయే మార్పులు..

- గిరిజనులపై దాడి చేయకుండా అటవీ, రెవెన్యూ సిబ్బందికి నియమావళి
- అటవీ సిబ్బందిపై దాడి చేసే వారిపైనా ఉక్కుపాదం
- అటవీ భూముల రక్షణకు సాయుధ బలగాల ఏర్పాటు

వామపక్షాల ఆందోళనలు..

పోడు భూముల విషయంలో అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ వైఖరిని వెల్లడించిన వెంటనే జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ప్రస్తుతం పోడులోకి వచ్చిన భూముల మొత్తానికి పట్టాలు జారీ చేయాలంటూ సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండలాల వారీగా రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అటవీ సంరక్షణ నియమాలు – 2022ను ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు.

రైతుబంధు, త్రీ ఫేస్ విద్యుత్..

పోడు పట్టాలు జారీ చేసిన భూములకు రైతుబంధు పథకం వర్తింపజేయడంతో పాటు త్రీ ఫేస్ విద్యుత్ కనెక్షన్ ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. పట్టాల జారీ అనంతరం గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా జనాభా లెక్కల వివరాలు సేకరిస్తామని, భూములు లేని గిరిజన కుటుంబాలను గుర్తించి, వారికి దళిత బంధు తరహాలో గిరిజన బంధు పథకం అమలు చేస్తామని కూడా ప్రకటించారు.

మిర్చి వ్యాపారి నిర్బంధం

డబ్బులు ఇవ్వడం లేదని స్తంభానికి కట్టేసిన రైతులు

సుజాతనగర్: మిర్చి కొనుగోలు చేసి మూడేళ్లుగా డబ్బు ఇవ్వడం లేదని ఆగ్రహించిన రైతులు.. వ్యాపారికి విద్యుత్ స్తంభానికి కట్టేసి నిర్బంధించిన ఘటన సుజాతనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. చండ్రుగొండ మండలం టేకులబంజర గ్రామానికి చెందిన ఇస్లావత్ రాజు, గుగులోత్ శ్రీరాం, భూక్యా నాగ అనే రైతులు జూలూరుపాడు మండలం కొమ్ముగూడేనికి చెందిన భూక్యా మణి అనే వ్యాపారికి మూడేళ్ల క్రితం మిరపకాయలు అమ్మారు. ఈ ముగ్గురు రైతులకు మణి నుంచి రూ.7 లక్షలు రావాల్సి ఉండగా, రేపు, మాపు అంటూ మూడేళ్లుగా తిప్పుకుంటున్నాడు. కాగా, రైతులు సుజాతనగర్‌లో ఇల్లు అమ్మకానికి ఉందంటూ మణిని పిలిపించారు. అతడు రాగానే తమ డబ్బు ఇచ్చేవరకూ వదిలిపెట్టేది లేదంటూ విద్యుత్ స్తంభానికి కట్టేశారు. విషయం తెలియగానే పోలీసులు వచ్చి వ్యాపారిని, రైతులను స్టేషన్‌కు తరలించారు. తాను గతంలో నాగ్‌పూర్‌లోని ఓ వ్యాపారికి మిర్చి పంట అమ్మానని, అతడు కరోనాతో మృతిచెందాడని, తనకు డబ్బు రానందునే రైతులకు కూడా చెల్లించలేకపోయానని వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశాడు. మణిని స్తంభానికి కట్టేసిన విషయం తెలియగానే జగన్నాథపురం, జూలూరుపాడు, చండ్రుగొండ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు సుజాతనగర్ చేరుకున్నారు. తాము కూడా మణికే మిర్చి విక్రయించామని, తమకు కూడా డబ్బు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో అందరికీ డబ్బు ఇస్తానని వ్యాపారి చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



వ్యాపారిని స్తంభానికి కట్టేయగా.. తాళ్లు విప్పుతున్న పోలీసులు

ఎక్కడా తాగునీటి ఎద్దడి రావొద్దు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సీఈ శ్రీనివాస్, పక్కన అధికారులు

- వేసవి ఏర్పాట్లపై దృష్టి సారించండి
- ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల వర్క్‌షాప్‌లో సీఈ శ్రీనివాస్

ఖమ్మంఅర్బన్: వేసవి సమీపించినందున ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాస్ ఆదేశించారు. ఖమ్మంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు శుక్రవారం వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఈ వర్క్‌షాప్‌లో సీఈ మాట్లాడుతూ తాగునీటి పథకాలకు నీటిని అందించే చెరువులు, ఇతర వనరుల్లో నిల్వలు అడుగంటకుండా ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. తాగునీటి సమస్య ఎదురుకాకుండా అన్ని చెరువులను సాగర్ జలాలతో నింపాలని, ఇందుకోసం జలవనరుల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అలాగే, తాగునీటి సరఫరా సమయాన ట్యాంకులు, పైపులైన్ల వద్ద ఇబ్బంది ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతీ హ్యాబిటేషన్‌లో ప్రత్యక్షంగా పరిశీలించి గ్రామాల్లో సర్పంచ్‌లతో సమావేశమవుతూ తాగునీటి సరఫరా పథకాలు, నిర్వహణకు అవసరమైన విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురుకాకుండా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ ఏజెన్సీల నిర్వహణ గడువు ముస్తున్నందున, ఎక్కడైనా చిన్నచిన్న మర్మత్తులు, ఇతరత్రా పనులు ఉంటే పూర్తి చేయించుకోవాలని సీఈ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ సదాశివం, ఈఈలు పుష్పలత, తిరుమలేష్, వాణిశ్రీ, నళినితో పాటు డీఈలు, జేఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రామాలయ ఈఓ బదిలీ

ఇన్‌చార్జ్ ఈఓగా రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ బి.శివాజీకి బదిలీ అయింది. తన మాతృ స్థానమైన రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా ఆయన తిరిగి వెళ్లనున్నారు. రెవెన్యూ శాఖకు రిపోర్టు చేయాలంటూ దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎల్.రమాదేవికి ఆలయ ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. 2020 సెప్టెంబర్ నుంచి ఈఓగా పనిచేస్తున్న శివాజీ సౌమ్యుడిగా పేరు సంపాదించారు. అయితే దేవస్థాన కార్యనిర్వహణలో మాత్రం తనదైన ముద్ర నిలుపుకోలేకపోయారు. ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్ నిర్వహణలో పలుమార్లు విఫలమయ్యారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. కాగా ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీసిన పాడైపోయిన లడ్డూల ఘటనలో పర్యవేక్షణ లోపంతోనే ఈ బదిలీ జరిగినట్లు చర్చ జరుగుతోంది. ఈ వివాదంపై ఇటీవల దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో ఒకరిగా రామాలయానికి వచ్చి విచారణ జరిపిన వారిలో రమాదేవి కూడా ఉండడం గమనార్హం.

దేవాదాయ శాఖ భూములపై పట్టు..

ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించిన రమాదేవి గతంలోనూ ఈఓగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించారు. 2020 జూలై 1 నుంచి సెప్టెంబర్ 21 వరకు పనిచేశారు. రమాదేవి నిజాయితీగా పని చేస్తారని, ఆలయ భూములపై ప్రత్యేక పట్టు ఉందనే పేరుంది. ఆమె పనిచేసిన ప్రతి చోటా ఆలయ భూముల పరిరక్షణ, వాటిపై కేసుల్లో విజయం సాధించిన దాఖలాలు ఉన్నాయి. ఏపీలోని పురుషోత్తపట్నంలో రామయ్య భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు, వివాదాలు జోరుగా సాగుతున్న క్రమంలో ఈమెకు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి.అనసూర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు, యజమాన్యం వారు తమ విద్యా సంస్థల్లో చదువుతున్న అర్హత కలిగిన వారి వివరాలను నమోదు చేసే పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఉచిత విద్యుత్ ఘనత వైఎస్‌దే..



రేవంత్‌రెడ్డి పాదయాత్రలో గిరిజన మహిళలు, నాయకులు

- రైతులకు బేడీలు వేయించిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది
- కాంగ్రెస్ హయాంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తాం
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ప్రజాకోర్టులో శిక్ష
- 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఆనాడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో తొమ్మిది గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఆయన చేపట్టిన హాథ్‌సేహాథ్ జోడో యాత్ర శుక్రవారం కామేపల్లి మండలంలో కొనసాగింది. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, తాము అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ ముందుకుసాగారు. అనంతరం కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేసిన వైఎస్.. రైతుల కష్టాలను చూసి అధికారంలోకి రాగానే ఉచిత విద్యుత్ అందించారని గుర్తుచేశారు. అలాగే రూ.1,250 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేస్తూ వైఎస్ మొదటి సంతకం చేశారని తెలిపారు. కానీ ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలతో విద్యుత్ అందక పంటలు ఎండిపోతుండడంతో రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో 29 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వడం కేసీఆర్‌కు సాధ్యం కాకపోగా.. గిట్టుబాటు ధర అడిగితే ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన ఘటనను రైతులు మరచిపోలేదన్నారు.

ఉరి తీసినా తప్పులేదు

కాంగ్రెస్ పార్టీ గుర్తు పై గెలిచి, పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను ప్రజాకోర్టులో శిక్షించాలని, వారిని రాజకీయంగా బొంద పెట్టాలని, ప్రజాకోర్టులో ఉరి తీసినా తప్పులేదని రేవంత్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫిరాయింపుదారులకు డిపాజిట్లు రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. కాగా, అభిమానంతో గెలిపించిన స్థానిక ఎమ్మెల్యే ఇక్కడి ప్రజలకు ద్రోహం చేసి ఫిరాయింపులకు పాల్పడిందని విమర్శించారు. కేసీఆర్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజంగా భావిస్తే 12 మంది ఎమ్మెల్యేలపై కూడా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



కాంగ్రెస్ విధానాలను వివరిస్తున్న రేవంత్‌రెడ్డి

ప్రజారాజ్యాన్ని స్థాపిద్దాం..

రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాన్ని ఖతం చేసి.. ప్రజారాజ్యాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హామీ ఇచ్చినట్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయలేదని పేర్కొన్నారు. ఏదేమైనా వచ్చే ఏడాది జనవరి 1న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే ఇల్లు కట్టుకునే ప్రతీ పేదకు రూ.5 లక్షలు, రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయడమే కాక ఖాళీగా ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, అటవీ భూముల హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలిస్తామని తెలిపారు. ఇక బయ్యారం ఉక్కు కర్మాగారం కోసం 26 జనవరి 2024న శిలాఫలకం వేసి వేలాది యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.సరిహద్దుల్లో కన్నుమూసిన సంతోష్‌బాబు భార్యకు ఉద్యోగం ఇచ్చిన ప్రభుత్వానికి, కామేపల్లికి చెందిన జవాన్ చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు చేతులు రావడం లేదన్నారు.

అందరికీ సహకరించిన నాయకుడు రాంరెడ్డి

అందరికీ సహకరించిన గొప్ప నాయకుడు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి అని కొనియాడారు. ఎమ్మెల్యే మరణిస్తే వారి కుటుంబ సభ్యులను ఏకగ్రీవం చేసే సంప్రదాయం ఉండేదని, కానీ వెంకట్‌రెడ్డి మరణించినప్పుడు ఉప ఎన్నికలో ఆయన భార్యను తాము పోటీకి దింపితే టీఆర్‌ఎస్ నుంచి అభ్యర్థిని పెట్టి ఆ కుటుంబాన్ని అవమానించారని పేర్కొన్నారు. కాగా, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా ప్రాధాన్యం ఇచ్చేలా సోనియా, రాహుల్ గాంధీతో మాట్లాడతానని రేవంత్ తెలిపారు. ఈ యాత్రలో మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, నేతలు మల్లు రవి, ఖమ్మం, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, చెవిటి వెంకన్న యాదవ్‌తో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి కృష్ణారెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందుకు చేరిన రేవంత్‌రెడ్డి



రాజీవ్‌నగర్‌తండాలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఇల్లెందు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఇల్లెందులోని రాజీవ్‌నగర్ తండాలో బస చేశారు. శనివారం ఇల్లెందు జేకే ఓసీలో కార్మికులతో మాట్లాడిన తిరిగి రాజీవ్‌నగర్ తండాకు చేరుకుంటారు. అక్కడ ప్రజాసంఘాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, మీడియాతో మాట్లాడుతారు. సాయంత్రం 4 గంటలకు రాజీవ్‌నగర్ నుంచి పాదయాత్ర ప్రారంభించి ఇల్లెందులోని సట్‌ఫిట్ బస్తీ, డీఎస్పీ క్వార్టర్స్, గోవింద్ సెంటర్, కొత్తబస్టాండ్, పాత బస్టాండ్ ద్వారా రాత్రి 7 గంటలకు జగదాంబ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. అనంతరం భద్రాచలం వెళ్లి అక్కడే బస చేస్తారు.

జన సమీకరణలో నేతలు...

రేవంత్‌రెడ్డి పాదయాత్ర, సభ విజయవంతానికి జన సమీకరణలో స్థానిక నాయకులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా నాయకులు చీమల వెంకటేశ్వర్లు, డానియేల్, పులి సైదులు, డాక్టర్ రవి, రాంచందర్ నాయక్, భూక్యా దళ్‌సింగ్, డాక్టర్ శంకర్‌నాయక్, గుండెబోయిన నాగమణి తదితరులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్

జూలూరుపాడు: విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్రవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ అన్నారు. మండలంలోని పడమట నర్సాపురం ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం గీతం యూనివర్సిటీ ఆధ్వర్యంలో సైన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించగా, జీవనలాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు భౌతిక, రసాయన, గణిత శాస్త్రాలపై పట్టు సాధించి, సైంటిస్టులు కావాలని ఆకాంక్షించారు. ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ధైర్యం ఎక్కువని, కష్టనష్టాలను ఓర్చి ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ప్రొఫెసర్లు గుండ్ల రాంబాబు, డాక్టర్ ఆర్.బాలాజీరావు, డాక్టర్ కటారి మాట్లాడుతూ భౌతిక, రసాయన, జీవ, గణిత శాస్త్రాలపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌ను జీవన్‌లాల్ ప్రారంభించారు. పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం, కాకర్ల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏజీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కాగా, ఆశ్రమ పాఠశాలకు రూ. లక్ష విలువైన రసాయన పరికరాలను అందజేశారు. అంతకుముందు ఆయన శ్రీసమ్మక్క – సారలమ్మ గద్దెలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ రూపాదేవి, జెడ్పీటీసీ భూక్యా కళావతి, ఎంపీపీ లావుడ్యా సోని, ఎంఈఓ గుగులోత్ వెంకట్, సీఐలు జె.వసంతకుమార్, రాజు, ఏజీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సుభద్ర, సర్పంచ్‌లు బోడా శాంతిరామ్, భూక్యా రాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జీవన్‌లాల్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

క్లుప్తంగా

రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో రూ.79.25 కోట్లతో రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఈ నెల 9న హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి ప్రతిపాదనలు అందజేశారు. 60 రహదారులకు 132 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు నిర్మించేందుకు ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కరకగూడెం మండలంలో రూ.16.70 కోట్లతో 12 రహదారులు, పినపాక మండలంలో రూ.28.70 కోట్లతో 20 రహదారులు, మణుగూరు మండలంలో రూ.6.35 కోట్లతో 6 రహదారులు, అశ్వాపురం మండలంలో రూ.21.10 కోట్లతో 16 రహదారులు, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో రూ.6.40 కోట్లతో 6 రహదారుల నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించారు.

బాధిత కుటుంబానికి సాయం చేయండి

అశ్వాపురం: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సురేందర్ తెలంగాణ నాయీ బ్రాహ్మణ సహకార సంస్థ ఫెడరేషన్ ఎండీకి ఈ నెల 4న లేఖ రాశారు. మండల పరిధిలోని మల్లెలమడుగులో జనవరి 1న అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై గుంజాల చినకృష్ణయ్య అనే వ్యక్తి సర్వం కోల్పోయాడు. దీంతో 'సాక్షి'లో కథనం ప్రచురించగా అధికారులు స్పందించి సహాయం కోసం బీసీ కార్పొరేషన్ కార్యాలయానికి దరఖాస్తు పంపించారు. కాగా అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఫెడరేషన్‌కు లేఖ రాశారు.

పేకాట స్థావరంపై దాడి

చంద్రుగొండ : మండలంలోని రావికంపాడు గ్రామశివారులో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు. వారి నుంచి రూ. 3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: దాడి ఘటనలో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. పట్టణంలోని జగదీష్ కాలనీకి చెందిన కిరణ్ నాయక్ తన ద్విచక్ర వాహనంతో మెడికల్ కాలనీలో వెళ్తుండగా, ఆ కాలనీకి చెందిన మాధవ్ అనే వ్యక్తి వచ్చి ద్విచక్ర వాహనాన్ని లాక్కున్నాడు. దీంతో కిరణ్ తన బంధువులతో కలిసి మాధవ్ ఇంటికి వెళ్లి బైక్ ఎందుకు లాక్కున్నావని అడిగాడు. దీంతో ఊగిపోయిన మాధవ్ నోటికి వచ్చిన పదజాలంతో తిట్టి, రాయితో కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య


సులోచన(ఫైల్)

టేకులపల్లి: పురుగుల మందు తాగి గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కోయగూడెం గ్రామానికి చెందిన కోరం సులోచన(40) గురువారం కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ బి. శ్రీనివాస్ తెలిపారు.

రాజ్‌కుమార్‌ను కోర్టులో హాజరు పరచాలి

మణుగూరుటౌన్: మావోయిస్టు పార్టీ సభ్యుడు రాజ్‌కుమార్‌ను కోర్టులో హాజరు పరచాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ కార్యకలాపాల్లో భాగంగా వెంకటాపురం గ్రామానికి వెళ్తుండగా గురువారం రాత్రి అక్కడ ఎటపాక పోలీసులు అరెస్టు చేశారని పేర్కొన్నారు. రాజ్‌కుమార్‌తోపాటు మరికొందరు గ్రామస్తులను సైతం అరెస్టు చేశారని, తక్షణమే వారందరిని కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు.

పత్తి దగ్ధం

రూ.70 వేల పంట నష్టం


దగ్ధమైన పత్తి

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామ పంచాయతీలో ఉన్న దానవాయిపేట శివారులో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో 10 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. బాధిత రైతుకు సుమారు రూ.70 వేల మేర నష్టం వాటిల్లింది. చేలో నుంచి తీసిన పత్తిని పాకలో నిల్వచేయగా, ప్రమాదవశాత్తు పాకకు మంటలు అంటుకుని పత్తి పూర్తిగా కాలిపోయిందని గిరిజన రైతు మడకం జోగయ్య తెలిపారు. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సిఉంది.

రామయ్యకు నిధులేవి..?

- భద్రాద్రి రామాలయానికి రూ.100 కోట్ల కోసం ఎదురుచూపులు
- ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు..
- తాజాగా కొండగట్టు ఆంజనేయస్వామికి నిధులు మంజూరు


రామాలయం వ్యూ

భద్రాచలం: రామబంటుగా పేరొందిన ఆంజనేయ స్వామి కొలువుదీరిన కొండగట్టు ఆలయానికి రూ.100 కోట్లు విడుదల చేస్తూ సీఎం కేసీఆర్ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. ఇది హర్షణీయమే అయినా.. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని తొమ్మిదేళ్ల క్రితం ప్రకటించి.. నేటికీ విడుదల చేయక పోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2014లో ప్రకటించారు..

రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో 2014లో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా భద్రాచలం వచ్చారు. స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నామని, మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని వెల్లడించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్, సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి నేతృత్వంలో పలు డిజైన్లను సైతం రూపొందించారు. ఇక అంతటితోనే చేతులు దులుపుకున్నారు. డిజైన్లు అటకెక్కాయి. ఇక ఆ తర్వాత జరిగిన బడ్జెట్ సమావేశాల్లోనూ రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించినా నేటికీ నిధులు రాలేదు. ఆ తర్వాత శ్రీరామనవమి వేడుకలకు సైతం కేసీఆర్ హాజరు కాలేదు. రెండోసారి పదవీ కాలం కూడా ముగింపు దశకు వస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు అధికార బీఆర్‌ఎస్ నాయకులు పెదవి విప్పటం లేదు. భద్రాచలం వాసులు, ప్రతి పక్ష పార్టీల ఆధ్వర్యంలో భద్రాచల దేవస్థానం, భద్రాచలం పట్టణాన్ని అభివృద్ధి చేయాలని పలు నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఇలా భద్రాచలంవాసులు అసంతృప్తిగా ఉన్న సమయంలోనే కొండగట్టు అంజన్న దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం నిధులను కేటాయించి, భద్రాచలంపై మాట్లాడకపోవడంపై ప్రజలు ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే అధికారికంగా జరపాలి



భద్రాచలంలో ప్రముఖంగా జరిగే ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి. ఈ ఏడాది మార్చిలో జరగబోయే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం వేడుకలను ప్రభుత్వం ప్రత్యేక ఉత్సవాలుగా ప్రకటించి నిధులు కేటాయించాలి. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ.100 కోట్లను తక్షణమే విడుదల చేసి రామభక్తుల మనోభావాలకు విలువ ఇవ్వాలి.

– చల్లగుళ్ల నాగేశ్వరరావు, టీఎస్‌జీవోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, భద్రాచలం

శ్రీరామనవమికి ఏటా నిధులు ఇవ్వాలి

ప్రతి ఏడాది భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు ప్రభుత్వం తరఫున నిధులు విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలోనే సుమారు కోటి రూపాయలకు పైగా వ్యయంతో శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదాయ, వ్యయాలు అటు ఇటుగా ఉంటుండటంతో భద్రాచల దేవస్థానం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల పుణ్యక్షేత్రంలో జరిగే శ్రీరానవమి ఉత్సవానికి ప్రభుత్వమే అధికారికంగా నిధులను విడుదల చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తరహాలో పెద్ద ఎత్తున నిధులను విడుదల చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని భక్తులు వేడుకుంటున్నారు. ఈ ఏడాది ప్రతి పన్నెండేళ్లకోసారి జరిగే పుష్కర పట్టాభిషేక మహోత్సవం భద్రాచలంలో జరగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సైతం అధికారులు ఇటీవల విడుదల చేశారు. పుష్కర సంవత్సరాలకు జరిగే పట్టాభిషేకం మహోత్సవాన్ని కనీవినీ ఎరుగని రీతిలో జరపాలని దేవస్థానం వైదిక సిబ్బంది, అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈ ఉత్సవాలకు మేడారం జాతర తరహాలో పెద్ద ఎత్తున నిధులను కేటాయించి విడుదల చేయాలని, భక్తులకు సకల ఏర్పాట్లు, వసతులను కల్పించాలని భక్తులు, భద్రాద్రి వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గిరిజనుడిపై 'ఖాకీ'చకం

- సివిల్ తగాదాలో బెదిరింపు
- రెండురోజులు పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు
- ఎస్పీ, కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు


ఎస్‌ఐ కొట్టాడని చెబుతున్న బాధితుడు బాలాజీ (ఇన్‌సెట్) శరీరంపై గాయం

అశ్వారావుపేట: సివిల్ తగాదాల్లో జోక్యం తగదని చట్టాలు చెబుతున్నా.. కొందరు పోలీసు అధికారులు వాటిని ఉల్లంఘిస్తున్నారు. ఓ భూ వివాదంలో తలదూర్చి అమాయక ఆదివాసీలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఇలాంటి ఘటన అశ్వారావుపేటలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. దమ్మపేట మండలం జగ్గారం గ్రామపంచాయతీ తాటి మల్లప్ప గుంపు గ్రామానికి చెందిన బాధితుడు వంకా బాలాజీ చెప్పిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన వంకా చిన్న కన్నప్ప, వంకా వెంకటేష్ తన భూమిని ఆక్రమించేందుకు దమ్మపేట ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ ద్వారా తనను చిత్రహింసలకు గురిచేశారని ఆరోపిస్తున్నాడు. వారు తన భూమిలోకి వచ్చి ఫెన్సింగ్ వేస్తుండగా అభ్యంతరం చెప్పడంతో తనపై దాడి చేశారని, కొద్ది సేపటి తర్వాత ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి ఎస్‌ఐ పిలుస్తున్నాడంటూ బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లారని చెప్పాడు. వంకా చిన్నకన్నప్ప, వంకా వెంకటేశ్వర్లుకు రెండెకరాల భూమి ఇచ్చేయాలంటూ ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ తనను బెదిరించారని, తాను ఒప్పుకోకపోవడంతో ఈనెల 1, 2 తేదీల్లో పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ చిత్రహింసలకు గురిచేసి ఇంటికి పంపించారని తెలిపాడు. మళ్లీ రెండు రోజుల తర్వాత పోలీసులు రమ్మన్నా.. ప్రాణభయంతో తాను వెళ్లలేదని చెప్పాడు.

వారసత్వపు భూమిపై ఇతరుల కన్ను..

దమ్మపేట మండలం జగ్గారం గ్రామపంచాయతీ తాటి మల్లప్ప గుంపు గ్రామ శివారు సర్వే నంబరు 29లో తన తాత వంకా కన్నప్పకు 2000 సంవత్సరంలో ట్రైబల్ కోర్టు ద్వారా సంక్రమించింది. కన్నప్ప ఏకైక కుమారుడు బుచ్చన్న కాగా, అతడి ఒకే కుమారుడు బాలాజీ. కన్నప్ప రెండేళ్ల క్రితం వరకు జీవించి ఉన్నాడని, అప్పటిదాకా ఆ భూమిని తామే సాగుచేసుకున్నామని.. తమ తాత చనిపోయాక కూడా ఎవరూ రాలేదని, ఇటీవల వంకా చిన్న కన్నప్ప, వంకా వెంకటేష్ తన భూమిలోకి వచ్చి బెదిరించడంతో పాటు పోలీసుల ద్వారా తనపై దాడి చేస్తున్నారని బాలాజీ ఆరోపిస్తున్నాడు.

అందుబాటులో లేని ఎస్సై

తనకు జరిగిన అన్యాయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకు ధైర్యం చేయడానికి వారం పట్టిందని, కొందరి ప్రోత్సాహంతో ఈనెల 8, 9 తేదీల్లో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశానని బాలాజీ చెప్పాడు. అయితే నాటి నుంచి ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ అందుబాటులో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై అశ్వారావుపేట సీఐ బొమ్మెర బాలకృష్ణను వివరణ కోరగా.. వారంతా బంధువులేనని, భూ వివాదం ఉండడంతో స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారని అన్నారు. ఎస్‌ఐ కొడితే తన దృష్టికి తీసుకురాకుండా ఇన్ని రోజులు ఆస్పత్రులకు ఎందుకు తిరిగారంటూ ప్రశ్నించారు. ఏదేమైనా దమ్మపేట మండలంలో పోలీసులు సివిల్ సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

నేటి నుంచి జర్నలిస్టులకు శిక్షణ


మాట్లాడుతున్న తెలంగాణ మీడియా అకాడమీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నేటి నుంచి రెండు రోజులపాటు జర్నలిస్టు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు మీడియా అకాడమీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పోస్టాఫీసు సెంటర్‌లోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 10.30 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో 11, 12 తేదీల్లో జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు పరిశోధనాత్మక కథనాలపై, టైమ్స్ ఆఫ్ ఇండియా జర్నలిస్టు సుధాకర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు జకీర్ బోధిస్తారని, రెండో రోజు జై తెలంగాణ టీవీ సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న, సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వాధ్యక్షులు ఘంటా చక్రపాణి బోధిస్తారని వివరించారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ మేనేజర్ వెంకటేష్, ఓఎస్డీ రహమాన్, డీపీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఖమ్మంలీగల్: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు గాను శ్రద్ధగా చదువుకోవాలని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మం త్రివేణి పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన సదస్సులో జిల్లా జడ్జి మాట్లాడుతూ బాల్యవివాహాలు, వరకట్నం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ రాష్ట్రస్థాయి పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను జడ్జి ప్రశంసాపత్రాలు అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి


మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

గుండాల: నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధితో ప్రజలు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మంజూరు చేసే నిధులను సీఎం కేసీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని, రానున్న కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. అనంతరం గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోలం సతీష్, శ్రీనివాసా చారి, పున్నం భిక్షపతి, సీతారాం నాయక్, శ్రీనివాసాచారి, కోడి ప్రభాకర్, శ్రీరాం చంద్రయ్య, గంగాదరి విజయ, ప్రకాష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

35 అడుగులకే బోరు నీరు!


బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

అశ్వాపురం: రెండు వందల అడుగుల వరకు బోరు వేసినా నీరు పడక పాయింట్లు మార్చుతుంటారు. కానీ మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో 35 అడుగులకే బోరు నుంచి నీరు ఉప్పొంగి వస్తోంది. గ్రామానికి చెందిన వేల్పుల సతీష్ ఇంట్లో శుక్రవారం బోరు వేయగా 35 అడుగులకే నీళ్లు వస్తున్నాయి. గ్రామంలో ఇటీవల పలు ఇళ్లలో బోరు వేయగా 150 అడుగుల మేర బోర్లు పడ్డాయి. సతీష్ ఇంట్లో తక్కువ లోతులోనే నీళ్లు పడటంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

రాత్రి వేళ వైద్య సిబ్బంది విధులు

పారాసైట్ క్రిమి కోసం గ్రామాల్లో పర్యటన


తావుర్యాతండాలో రక్తనమూనా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

టేకులపల్లి: వైద్య సిబ్బంది రాత్రి వేళ కూడా విధులు నిర్వర్తిస్తూ ప్రజారోగ్యంపై దృష్టి పెడుతున్నారు. గ్రామాల్లో పైలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు అధికారులు రక్తనమూనాలు సేకరిస్తున్నారు. పైలేరియాకు సంబంధించిన పారాసైట్ క్రిమి రాత్రి పూట మాత్రమే రక్తంలో సంచరిస్తుంది. దీంతో గురువారం రాత్రి 10 గంటల తర్వాత తావుర్యాతండా గ్రామంలో సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యటించారు. ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో 300 మంది రక్త నమూనాలు సేకరించారు. పరీక్షల నిమిత్తం టీహబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు మానస, స్వప్న, అనసూయ, స్రవంతి,రాంబాబు, సరోజ, రజియా, ముత్తమ్మ, మంగమ్మ, రమేష్ బాబు, సర్పంచ్ తేజావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి హెచ్చరిక ఉత్తర్వులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఇటీవల బూజు పట్టిన లడ్డూల విక్రయంలో దేవస్థానం ఉద్యోగులకు శుక్రవారం ఈఓ శివాజీ హెచ్చరిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై త్రిసభ్య కమిటీ విచారణ అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు నలుగురు ఉద్యోగులకు మెమో ఇచ్చారు. ఉద్యోగుల వివరణ అనంతరం ఈఓ హెచ్చరిక ఉత్తర్వులను జారీ చేశారు. లడ్డూలు పాడైపోవటం, విక్రయాలు జరపటంలో పర్యవేక్షణా లోపానికి ఈ నలుగురిదే బాధ్యత అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొనసాగుతున్న విచారణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో వివాహితపై జరిగిన హత్యాయత్నం కేసు విషయంలో శుక్రవారం కూడా పోలీసుల విచారణ కొనసాగింది. పట్టణ పరిధిలోని కూలీలైన్ ఏరియాకు చెందిన రమేష్ అనే వ్యక్తి గురువారం భర్త తన భార్య కల్పనపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కత్తితో దాడి చేయగా, గాయాపాలైన ఆమె కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది శుక్రవారం డిశ్చార్జ్ అయ్యింది. నిందితుడు రమేష్ పోలీసుల అదుపులో ఉండగా, దాడికి వాడిన మారణాయుధాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

ఇల్లు దగ్ధం

రూ.15 లక్షల మేర ఆస్తినష్టం


దగ్ధమైన ఇల్లు

చర్ల: మండలంలోని గన్నవరంకాలనీలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇర్పా ప్రశాంత్ ఇంట్లో గురువారం రాత్రి 12 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు లేచి ఇంటి మొత్తానికి వ్యాపించాయి. నిద్రలో ఉన్న కుటుంబ సభ్యులు మంటల వేడికి భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. కుటుంబ యజమాని ఇంట్లో సామగ్రి బయటకు తీసేప్రయత్న చేయగా, చేతులకు మంటలు అంటుకుని గాయాలయ్యాయి. భద్రాచలం అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్‌తో సిబ్బంది చేరుకునేసరికే ఇల్లు, ఇంట్లో విలువైన సామగ్రి, 1.70 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, పత్తి విక్రయించగా వచ్చిన రూ. 2 లక్షల నగదు పూర్తిగా కాలిపోయాయి. కుటుంబీకులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. ఆర్‌ఐ వెంకటేశ్వరరావు సంఘటనా ప్రాంతానికి చేరుకుని నష్టం అంచనా వేశారు. తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. 'మేమున్నాం' సహాయక కమిటీ, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు బాధితులను పరామర్శించి నిత్యావసరాలు అందించారు.

పోక్సో కేసు నమోదు

సుజాతనగర్: మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ యువకుడిపై పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పోక్సో కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టపగలే చోరీ

15 తులాల బంగారం అపహరణ


సంఘటనా పరిశీలిస్తున్న ఎస్సై సుమన్

చుంచుపల్లి: రామాంజనేయకాలనీలో శుక్రవారం పట్టపగలు తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామాంజనేయకాలనీలో నివాసముంటున్న బొద్దుల మోహన్‌కుమార్ కుటుంబ సభ్యులు ఉదయం 9 గంటలకు ఇంటికి తాళం వేసి ప్రైవేట్ పాఠశాలలో విధులకు వెళ్లారు. సాయంత్రం సమయంలో తిరిగి ఇంటికి వచ్చిసరికే సైడ్ డోర్‌ను పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా రెండు బీరువాలను పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలను చోరీ చేశారు. చుంచుపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రమాకాంత్, ఎస్సై సుమన్, క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. 15 తులాల బంగారంతోపాటు వెండి నగలు, రూ.15 వేల నగదు అపహరించినట్లు బాధితులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో..

పాల్వంచరూరల్: సీసీ కెమెరాలు ఉన్నా, సిబ్బంది పహారా కాస్తున్నా పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలో సౌండ్ సిస్టానికి సంబంధించిన సుమారు రూ.60 వేల విలువైన సామగ్రిని గత బుధవారం రాత్రి చోరీ చేశారు. కానీ శుక్రవారం వరకు ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఈ విషయమై ఈఓ రజనీకుమారిని వివరణ కోరగా.. సౌండ్ సిస్టమ్‌నకి సంబంధించిన సామగ్రి మాయమైనది నిజమేనని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిబ్బందికి సూచించానని, తాను పాలకుర్తిలో ఉన్నానని చెప్పుకొచ్చారు.